పెద్ద కథ

# కొత్తయిల్లు

కొలకలూరి

(గత సంచిక తరువాయి)

నాటకంలో కన్నుబున్సు మనే బాల నాగు- సభారంజని జీవితంలో కుక్కిన పేనయింది. గ్రీన్‌రూంలో బాలనాగు మాయల పకీరు సరదాలు పోయేవాళ్ళు. రంగస్థలంలో ప్రేమసిగా నటించే సంగు నిజజీవితంలో ఈర్ష్యపడ సాగింది.

చలమయ్యను చేపట్టకముంది చిల్లరిగా తిరిగిన సభారంజని. ఆమ ధ్య మనస్సును అటూ ఇటూ వూపుకొన్న సభారంజని ఇప్పుడు లెక్క ప్రకారం సహధర్మచారిణి అయింది. వెన్నపూస కరిగిపోయే వెన్నపూస వూగిపోయే ధోరణి దూరమయిపోయింది. చలమయ్య గొప్పనటుడయి పోయాడు.

అయిదేళ్ళలో పేరు ప్రఖ్యాతులు వచ్చాయి. ధనసంపాధన బాగుంది, గుంటూరులో మంచి ఇల్లు. తగినంతగా- సంపాదించుకొన్నారు. చలమయ్య చీకటి బ్రతుకులో ఉషారాగం ప్రసరించింది. అప్పుడతను చింతలులేని చిద్విలాస పురుషుడు.

అతని అడుగుజాడల్లో సభారంజని. ఇప్పుడు ఆమె చెప్పినట్లు వింటుంది. చేయమన్నట్టు చేస్తుంది. భర్త దైవంగా భావించుకొనే స్థితికి వచ్చింది, అతన్ని విడిచి ఉండలేనని నమ్మింది. తనకంటే మంచినటుణ్ణి తను తయారు చేసుకొన్నా నన్న ధీమా కూడా ఆమెకు కలిగింది.

'అ(! ఏందికత? ఏడుండావ్? ఇంత కాలం(వేం జేశావ్ ఏంది జెప్పు!' సినోడు దగరగా వచ్చి చూరుకుట్టుబద్ద నేలమీద పడుకో బెట్టి చుట్ట ముట్టించుకొన్నాడు.

ఇల్లు కప్పటం పూర్తయిపోయింది. మిగతా పనివాళ్ళుకూడా వచ్చి మంచం దగ్గర కూర్చున్నారు. పొలిగట్టె తీసుకొని ఇంటిచుట్టూ పూడుస్తున్నాడు బసవయ్య సూర్యుడు కందిపోయిన ముఖంతో పరమట కొండల్లోకి దిగిపోయాడు.

పేరమ్మ సినోడు అడిగిన ప్రశ్నలు వింది.

'అన్నా! యెందుకామాటలు: లేని పోనిమాటలు!' అంది.

సినోడేమీ మాట్లాడలేదు. చలమయ్య జవాబు చెప్పలేదు. పేరమ్మకు తనమీద కోపం వుందనిపించింది. తనేంచేయాలో తెలియలేదు.

బసవయ్య సీతమ్మ, పేరమ్మ ముగ్గురూ ఒకచోట్ల చేరి ఏదేదో మాట్లాడుకొంటున్నారు. ఏం మాట్లాడుకొంటున్నారో తెలియలేదు. తను వెళ్ళాలనిపించింది. వెళ్ళటం బాగుండదని ఆలోచన. పిలవని పేరంటం అవుతుంది. తనతో వాళ్ళు అంతరంగికంగా మాట్లాడరు। వాళ్ళు ముగ్గురు ఒకటేమాట। ఒకటే హృదయం ఒకటే ఆలోచన। తను వేరుగా ఎడంగా పరాయి వాడులాగా సొంతయిల్లు వంటి చోటే ఉండలేననుకొన్నాడు.

తనను గూర్చి ఏమయినా చెప్పుకొంటున్నారేమో ననిపించింది. ఏం చెప్పుకొంటారు? ఇంతకాలం ఇల్లు గుర్తించని మనిషి ఇప్పుడు ఇక్కడెందుకు వెళ్ళిపొమ్మని చెప్పబోతున్నారేమో। తన ఉనికి అభ్యంతరకరంగా వుందేమో।

వాళ్ళు ముగ్గురూ మూడు కోణాలు మూడు బాహువులు. వాళ్ళకలయికతో త్రికోణం ఏర్పడింది. అందులో మరో కోణం మరో బాహువుకు ఆసమబాహు త్రిభుజంలో చోటులేదు. ఒక బాహువును మరొక బాహువు బలంగా ఆకర్షిస్తూ వుంది అందులో తనకు చోటులేదు. చలమయ్య హృదయం భయం పొరలలో చిక్కుబడి పోతూ వుంది.

వాళ్ళలో తనూ చేరితే, ఏర్పడే చదరం అన్నివిధాలా బాగానే వుండవచ్చు. అయితే ఆ అవకాశం ఎలా కలుగుతుంది. బసవయ్యకు తనంటే ఇష్టంలేనట్టుంది సీతదగ్గరకు ఇష్టమయినా భర్తమాట జవదాటలేకపోవచ్చు. తన భార్యకూడా ఇంతకాలంగా ఉన్నకొడుకుని. ఇప్పుడు తనకోసం దూరం చేసుకోలేదు. దూరం చేసుకోమనటం కూడా న్యాయంకాదు.


ఆమె కొడుకు కోసం అష్టకష్టాలు పడింది. తనకోసం బహుశా ఎదురు చూస్తూ బాధలు ఓర్పుతో దిగమ్రింగి వుంటుంది. అటువంటివాళ్ళ సంబంధం తను పాడుచేసే పరిస్థితి రాకుండా వుండాలి.

ఒక్కటే మార్గం। తనక్కణ్ణుంచి వెళ్ళిపోవాలి. దూరంగా వెళ్ళిపోవాలి. మళ్ళీ వీళ్ళ ఎదుటకు రాకూడదు అలజడి సృష్టింపకూడదు. అయితే ఈ స్థితిలో తనెక్కడకు పోగలడు? చచ్చిందాకా ఇక్కడే ఎలాగయినా బ్రతుకుదామనే ఆశతో వచ్చాడు. ఇప్పుడేం చేయటం:

చలమయ్య ఆలోచన తాటాకుల మంట। చురచుర త్వరత్వరగా మండి చప్పున ఆరిపోయి. ఆపైన నిప్పుజాడ కూడా లేకుండా అణిపోయే మంట। మంటలోనే ఏమైనాచేస్తే మళ్ళీదానికి తిరుగుండదు. మంట తగ్గితే మళ్ళీ మంట పుట్టటం సామాన్యంగా త్వరగా జరగదు.

వాళ్ళ మాటలు పూర్తయ్యాయి. పేరమ్మ బొడ్లోనుంచి తాళం తీసిఇచ్చింది బసవయ్య లోపలికిపోయి డబ్బు తీసుకు వచ్చాడు. ముగ్గురు పనిచేసిన వాళ్ళకు ఇచ్చాడు వాళ్ళు వెళ్ళిపోయారు

బైటఉన్న చిన్న సామానులు ఆడవాళ్ళు ఇంట్లో పెడుతున్నారు. పెద్ద సామానులు బసవయ్య పెడుతున్నాడు. తనుకూడా వెళ్ళి వాళ్ళకు సహాయం చేదామనుకొన్నాడు. మళ్ళీ ఏమంటారోనని వూరుకొన్నాడు.




మెట్టుబల్ల బసవయ్య ఒక్కడే లోపల పెట్టలేకపోతున్నాడు. చలమయ్య మంచం దిగి, వెళ్ళి ఒకకోపు పట్టు కొన్నాడు. ఇద్దరూ లోపలపెట్టారు. దానిమీద బియ్యంబస్తా, ఒడ్లుబస్తాలు వేస్తున్నాడు బసవయ్య.

చలమయ్యకు ఆనందంగా వుంది. తను పనిచేస్తే కొడుకు ఏమీ అనలేదని ఆనందం అపరిమితంగా కలుగుతూ వుంది.

బరువుపని చేయటంవల్ల గుండెలో పోటుపుట్టింది. కణేల్ కణేల్‌మని దగ్గి వుమ్మివేశాడు. ఉమ్మిలో రక్తపుజీర కనిపించింది. సీతమ్మను పిలిచి మంచి నీళ్ళు తీసుకొని పుక్కిలించాడు. ఆమె ఉమ్మిలో ఎర్రదనం చూచింద. అత్తతో చెప్పింది.

ఆమెవచ్చి కళ్ళె చూచి వణికి పోయింది. అప్పుడు చలమయ్య గటగటా నీళ్ళుతాగుతున్నాడు. అతనికాక

క్రొత్త భయం కలిగింది. ఈ రోగిష్టి వాడు ఇక్కడెందుకు అంటారేమోనని.

ఏమయినా వాళ్ళు పొమ్మనక ముందే వెళ్ళిపోవటం బాగుంటుందనిపించింది. దిక్కుతోచటంలేదు. ఎక్కడికివెళ్ళేటట్లు?

'ఏవయిందేంది ?'

పేరమ్మ అతని కళ్ళలోకి చూస్తూ అడిగింది.

'ఏం కాలేదు!'

చలమయ్య మంచంమీద కూర్చున్నాడు. ఆమె చుట్టింటిలోకి వెళ్ళిపోయింది. మనస్సంతా వ్యాకులతచెంది సంచలించి పోతున్నాడు చలమయ్య. జేబు తడిమిచూచుకొన్నాడు. భద్రంగా వుంది పర్సు!

భవిష్యత్తుమీద ఆశలు పెట్టుకొని వర్తమానంలో జీవితం గుండెలమీద కుంపటచేసుకొని పేరమ్మ గతం గడిపి




వేసింది. ఇప్పటికి బ్రతుకులో నిలకడ చిక్కింది.

కడచినేడు కొడుక్కు పెళ్ళిచేసింది. అంతకు మూడేళ్ళు ముందు రెండెకరాల పొలం కొనుక్కుంది. పదేళ్ళ ముందు పాతయిల్లు అచ్చిరావటంలేదని స్థలం మార్చి రాతిగోడలయిల్లు కట్టించుకొంది.

ఇంత జీవితం వెనుక భగవంతుడు నుదుటిమీద కుంకుమబొట్టు క్రిందవ్రాసిన రాతలో తిరిగిన వంకరు మాటువ సాఫీగా వున్న అదృష్టంకాక, ఆమె శరీరంనుంచి కణం కణంగా స్రవించిన చెమటబొట్లు విలువవుంది.

పుట్టినింటివాళ్ళూ, మెట్టినింటివాళ్ళు దూరం అయితే, బ్రతుకు అర్థ శూన్యంగా, నిస్సారంగా ఎదురయితే, గుండెను కూడదీసుకొని, పట్టుదలను వెంటదీసుకొని ఆమె నడచిన బాటలో అదృష్టం పండింది.

తనభర్త తనకు కాకుండాపోయాడని చాలాకాలం చింతించింది. మళ్ళీ చూడగలగుతాననే ఆశను ఎన్నో ఏళ్ళక్రితం వదిలేసింది. బ్రతికివున్నాడో గతించాడో తెలియని భర్తకు గాజూ పూస ఇవ్వాలో లేదో తెలియక ఊరుకొంది.

వాటి కీనాటికి సార్థకత కలిగిందని తెలిసి ఆనందించింది. ఆమెకు భర్తృసంబంధి ఆనందం వ్యక్తంచేసుకోవటం తెలియదు.

పసితనంలోనే పెళ్ళయింది. తల్లయింది. భర్తకు దూరమయింది. భర్తతో మాట్లాడటం ఎట్లాగో ఆమెకిప్పుడు

అర్థంకావటంలేదు. ఏనాడయినా భర్త కనిపిస్తే గుండెలో గూడుకట్టుకొన్న సొదఅంతా చెప్పుకొందామనుకొంది. తీరా భర్త ఎదుటికివస్తే ఎలా నిలబడాలో కూడా అంతుబట్టటంలేదు.

భర్తవరుస చూస్తుంటే భయంగా వుంది. ఎలాగో వుండే మనిషి ఇలాగయిపోయాడు. ఎప్పుడూ ఏదో పోగొట్టుకొన్నవాడి మాదిరిగా పిచ్చిగా చూస్తున్నాడు. ఏం అడిగితే ఏం అనుకొంటాడో ఏం అడక్కపోతే ఏం అనుకుంటాడో తెలియకుండా వుంది.

చలమయ్య దుడుకుమనిషి ! మాట్లాడే తీరు తెలియనివాడు. వాడి తరహా కూడా ఉదయంనుంచి చిత్రంగానే వుంది. తండ్రికొడుకుల మధ్య ఎటువంటి పరిణామాలు తలెత్తుతాయో ! కొడుకు ప్రయోజకుడయ్యాడు. భర్త అనారోగ్యంగా ఉన్నాడు.

తండ్రికొడుకుల మధ్య పొరపొచ్చాలొస్తే బ్రతుకగలిగిన కొడుకుకంటే బ్రతుకలేని భర్త తనకు ముఖ్యం కాదా? పేరమ్మ ఆలోచనలు అంతులేకుండా ఉన్నాయి. దరీ దాపు లేకుండా సాగుతున్నాయి.

అవాంతరాల అగ్నిపర్వతం పగుళ్లు, ఆటంకాల కీ కారణ్యాలు, అలజడుల తుఫానులు అధిగమించి ఆపై జీవితం, సభారంజనితో సౌఖ్యంగానే గడిపిన చలమయ్య వయస్సు పైబడుతున్న కొద్దీ దూరమవుతున్న కళాజీవితం తీరు తెన్నులు, అర్థం చేసుకోసాగాడు. సభారంజని యౌవనంలో ఉన్నప్పుడామె

## మనసు పాడిన పాట

**మానేపల్లి సత్యనారాయణ**

యెన్ని స్వర్గాలు పండినవోకాని
మధుర మంజుల సంగీతరోచి తోచె
యెన్ని స్వర్గాలు మూర్ఛిలినొకాని
అంద మానందమై గుండెనిండిపోయె

మొలకలెత్తిన దరుణిమ తూర్పు దిశను
పులకరించెను వెలుగులో ప్రకృతి యంత
పూలు తలలెత్తిహాయిగ నవ్వుచుండె
తెరచుకున్నది మరియొక దినము నేడు

పాడినది గుండెలోనుండి కోకిలమ్మ
పాట తీపికి మామిడి పూలుపూచె
పరిమళము నిండె వినుచున్న వీను లందు
పరవశముతోడ లోకమే పాటపాడె

ఆడిననాటకాల కున్నంతవిలువ తర్వాత లేకుండా పోజొచ్చింది. పది పన్నెండేళ్ళు ఆమెకు అంతో ఇంతో రాణింపు మిగిలే వుంది ఆమెతో తను జీవితం ప్రారంభించి తర్వాత.

ఆపైన క్షీణించి పోయింది.

చలమయ్యకు కొంతలో కొంత ఆదాయం వుండేది. అది కుటుంబం ఖర్చులకు సరిపోతూ వచ్చింది. మరీ

మూడేళ్ళనుంచి ఏమీ రాబడిలేకుండా పోయింది. ఎవరూ నాటకాల కాంట్రాక్టు అడగటంలేదు. చిన్న పాత్రలయినా ఇవ్వటంలేదు. దీనికితోడు గుండె బల హీనత ఒకటి. ఒకళ్ళిద్దరు డాక్టర్లు టి.బి. అన్నారు. మరికొందరు విశ్రాంతితీసుకో మన్నారు. విశ్రాంతి అవసరం నిజమే కావచ్చుగానీ బ్రతకటం అనేది అంత కన్నా నిజం। ఎలా బ్రతకటం సంపా దించిన రోజుల్లో నాలుగుచేతులతో ఖర్చుపెట్టుకున్నారు. ఆ యిల్లయినా లేక పోతే పల్లకాడుకూడా వుండనిచ్చేదని చెప్పే అవకాశంలేదు వాళ్ళకు. ఇప్పు డొక్కచేతితో ఖర్చుచేసుకోటానికి దాచు కున్న కొద్దోగొప్పో చాలిచాలకుండా అయింది.

జీవితంలోని పూర్వభాగం. రంగ స్థలంమీద మాయలఫకీరుగా నటించ




టంతో సరిపోయింది. ఉత్తరభాగం బిత్తరపోయేట్టు చేస్తూవుంది. నాట కంలో ప్రక్కటెముకలకు డొక్కలు అంటుకు పోయేట్టు నవ్వి జీవితం ఏడ్పు మిగుల్చుకొన్నాడు చలమయ్య.


డాక్టర్లు చెప్పిన సలహా తను పాటిం చాడో, కంట్రాక్టర్లు పాటించేట్టుచేశారో చెప్పటం కష్టమేగాని, చలమయ్యకు విశ్రాంతి చిక్కింది. చిక్కిన విశ్రాంతి అక్షరాలా మిగలలేదు. స్ఖలితం కాసా గింది.

సభారంజనితో ఇరవై ఏళ్ళ దాంపత్య జీవితంమీద దేవుడు గీతకన్నా వేశాడో దయాదృక్కులు ప్రసాదించాడో గానీ సంతానంలేకుండా చేశాడు. మొదట్లో పిల్లలూ గోలా అక్కరలేదనుకొంది గానీ, క్రమక్రమంగా పిల్లలు కలిగితే బాగుండునని సభారంజని కోరుకున్న కోర్కె తీర్చటానికి దేవుడికి టైంలేక పోయింది.

నాలుగునెలల క్రితం ఆమెకు టైఫా యిడ్ జ్వరంవస్తే చలమయ్య కంగారు పడలేదు. ఆమెకు ఎప్పుడూ ఏ జబ్బూ రాలేదు. మంచి ఆరోగ్యం అని చల మయ్య నమ్మకం. తననుగూర్చే భయ పడుతూవుండేవాడు.

ఆమెకు వచ్చిన జబ్బు సామాన్యంగా రాలేదని తెలిసింతర్వాత హాస్పటల్లో చేర్పించాడు. తనకు చేతనయినసహాయం చేశాడు. డబ్బు వెనుకాముందూ చూడ కుండా అప్పో సప్పో చేసి తెచ్చి ఖర్చు పెట్టాడు. అయితే మానవప్రయత్నం వ్యర్థం అయింది.

## మగవాడి పాట్లు – 3




ఇరవై ఏళ్ళు తనతో జీవించి, మనో వాక్కాయ కర్మల తనకు భాగస్వామిని అయిన సభారంజని చితి ముట్టిస్తూ చల మయ్య భగ్గున మండిపోయాడు. జీవితం అర్థరహితంగా శూన్యంగా గోచరించింది. ఆమెకు సంస్కారంచేసి చూస్తే లోకం విశాలంగా కనిపించసాగింది.

ఎప్పుడూ మబ్బులు చూచి ఆనందించని చలమయ్య ఆమె కష్టంలోంచి వచ్చిన పొగలే ఆ మబ్బులనుకొని ఆకాశం అంతటిని ప్రేమించగలిగాడు.

నగరం నడిదీపుమీద గీసుకుపోయిన గీతల్లాంటి రోడ్డుమీద పిచ్చిగా తిరిగాడు. ఏం చేయాలో తెలియలేదు. రంగస్థలం మీద నటించేటప్పుడు సదస్యులు కొట్టిన చప్పట్లు ఆనందంతో వెర్రిగా స్వీకరించిన చలమయ్య జీవితంలో బ్రతుకుతున్నప్పుడు అప్పులవాళ్ళు కొట్టే చప్పట్లు దీనంగా పిచ్చిగా అర్థంచేసుకున్న చలమయ్య తప్పనిసరయి ఇల్లు తెగనమ్మి, అప్పులుతీర్చి మిగిలినడబ్బు పర్సులో పెట్టుకొని నగరం అంతా ఇల్లుగా భావించుకొన్నాడు.

మనిషికి విశాలసంధి భయంపుట్టిస్తుంది. విస్తృతి చూచి పిచ్చవాడయిపోతాడు. అందుకే చిన్నపరిధి ఏర్పరుచుకొంటాడు. అందులో నూతిలోకప్ప

లాగా జీవిస్తాడు. మనిషి పెరిగితే పరిధి పెరిగినా చింతలేదుకానీ, మనిషి యధా పూర్వకంగా వున్నప్పుడు పరిధి విస్తృతం అయితే భరించలేడు. చలమయ్య జీవితం అలాగే అయిపోయింది. నగరంలో ఉండలేకపోయాడు. వందలు, వేలు, లక్షలు మంది జనంలో. జనుల మధ్య వొంటరివాడై పోయాడు. ఒంటరితనం అతన్ని నింపివేసింది.

నాది నాకు అనే తత్త్వం ప్రతి మనిషికీ సహజం. అటువంటికోర్కెలు లేకపోతే మనిషి బ్రతికివున్నా చనిపోయినవాడితో సమానం. చలమయ్యకు ఆర్థికంగా చనిపోవటం ఇష్టంలేదు. నాకే లోకంలో ఏముందని, ప్రతిమనిషిఅంతా శూన్యంగా ఎక్కడా ఆదరణలేక, నమ్ముకొన్న పడవ నడిసముద్రంలో మునిగిపోతే జీవితం నిస్సారంగా కనిపిస్తే, తుదిమొదళ్ళులేని శూన్యత ఎటుచూచినా గోచరమయితే భగవంతుడే గుర్తుకు వస్తాడు. చలమయ్యకు దేవుడు గుర్తుకు వచ్చిన క్షణం స్మృతిపథంలో మెరుపు మెరిసినట్లు మరుపు మేఘాలమధ్య భార్య కనిపించింది.

ఇంతకాలం గుర్తురాని భార్య కొడుకు ఆసమయంలో జ్ఞప్తికొస్తే చలమయ్య కళ్ళలో నీళ్ళు తిరిగాయి. ఏవూరునుంచో




ఏవూరుకో పోతున్న ఏ బాటసారో పడు కోవటానికి చోటు ఇవ్వమంటే ఇవ్వ గలిగే యింటిలో అడుక్కొనే బిచ్చ గాడికి ఇంత అన్నం పెట్టగలిగే ఇంటిలో తనకు చోటు దొరకక పోతుందా అని గంపెడాశతో వచ్చాడు చలమయ్య.

ఊళ్ళోవాళ్ళు పేరమ్మను ఎన్నివరస లతో పిలుస్తారో అన్నిసంబోధనలతో వచ్చారు చేలమయ్యను చూచిపోదా మని. ఇరవై ఏళ్ళయినా లేనివాళ్ళు అంతమంది వచ్చి ఆ చలమయ్యను ఏం చూస్తారు? అంతావేలం వెర్రిగా వుంది. పసివాళ్ళు గుంపులుగుంపులుగా పోగయ్యారు.

చిన్నోడు వూళ్ళోనుంచి పోతూ కనబడవాళ్ళకల్లా చలమయ్య వచ్చాడని చెప్పుకొంటూవెళ్ళాడు. ఏవురా సెలః వయ్య ఏఁవిటా కతాఁవటాని' ఎవర యినా అడిగితే వివరాలతోసహా అంతా పూసగుచ్చినట్లు ఆ చెవినీ ఈ చెవినీ వేస్తూ వెళుతున్నాడు.

కొందరికి వింతగావుంది. కొందరికి విడ్డూరంగావుంది. పిల్లలుమాత్రం చల మయ్యను సర్కస్‌లో మృగాన్ని ఆడిం చేవాడి చేతిలోని కోతిని చూచినట్లు చూస్తున్నారు.

పసివాణ్ణి, అమాయకురాలిని, దిక్కు లేని తల్లి దండ్రుల్ని వదిలి నీసుఖం నువ్వు చూచుకొంటూ దేశాలవెంట పోవ టానికి నీకు కాళ్ళెట్టా ఆడాయనీ, ఎక్క డికి పోయావు. ఏం చూశావు. ఇంత కాలం ఎన్నిబాధలు పడ్డావోననీ ఇప్పుడా యిల్లు గుర్తుకొచ్చిందీ. వీళ్ళ కన్నీళ్ళు

> **రచనా వ్యాసంగం**
>
> ఒక వ్యాపారస్తుడు రచయిత అయిన పాత స్నేహితుని కలుసుకున్నాడు!
> "ఏం చేస్తున్నావురా బ్రదర్!"
> "కథా రచన—"
> "ఒక్కటైనా అమ్మేవా?"
> "ఇంట్లోవున్న కుర్చి, టేబుల్, టైంపీసు – అన్నీ ఒక్కొ క్కటే అమ్మేశాను."

నువ్వు చూళ్ళేదుగానీ, చూస్తే గుండె తరుక్కుపోయేదనీ ఎవరెవరో ఏమేమో పలికారు. అన్నీ విన్నాడు చలమయ్య. కొన్నింటికి జవాబు చెప్పాడు. కొన్నిం టికి తలవంచుకొన్నాడు. అన్నింటికీ దుఃఖపడ్డాడు. ఎవరెవరో వస్తున్నారు ఏమేమో అంటున్నారు వెళిపోతున్నారు.

జనం రాకపోకల రద్దీ తగ్గింతర్వాత సీతమ్మవచ్చి 'నీళ్ళుతొరిపా. చెట్టుక్రింద బిండదగ్గర పెట్టా ఇదుగో కండవా' అంటూ టవల్ అందించింది. చలమయ్య స్నానం ముగించి వచ్చాడు. కొడుకు పంచె కట్టుకొన్నాడు. పైజామా లాల్చీ ఇంట్లో భద్రంగా దాయమనీ అందులో డబ్బుందనీ భార్యకు చెప్పాడు. అంతలో బసవయ్య స్నానం పూర్తిచేసుకొని వచ్చాడు. ఇద్దరికీ చుట్టింటిలో సీతమ్మ అన్నం వడ్డించింది. ఎవరూ ఎవరితో

ఎక్కువగా మాట్లాడలేదు.

పేరమ్మ పంచపాళీలో మంచం వేసింది. దుప్పటి పరిచింది. దిండువేసింది చలమయ్య మంచంమీద కూర్చున్నాడు. బీడీ ముట్టించుకొన్నాడు.

పైపంచె భుజంమీద వేసుకొని 'అటు బోయొత్తా' నంటూ బసవయ్య వెళ్ళాడు. అతను ముభావంగా వున్నాడు.

బీడి పారేశాడు చలమయ్య. పేరమ్మకు తనంటే తిరస్కారం లేదు. సీతమ్మకు ఎంతో సంతోషంగా నేవుంది. బసవయ్య ధోరణిమాత్రం అంతుబట్టలెదు.

తెగని ఆలోచన త్రాళ్ళతో జీవితం బిగదీసుకొంటుంటే ఎప్పుడో విద్రవచ్చి కనురెప్పలపై వాలింది. కునుకుపట్టింది. త్రుళ్ళిపడి మేలుకొనేసరికి చుట్టింటి లోంచి మాటలు వినబడుతున్నాయి. ఆకంఠస్వరాలుచలమయ్య గుర్తుబట్టాడు. పేరమ్మ బసవయ్య! తల్లీ కొడుకు! భార్యా కొడుకు!

'ఎవుడాడు? నిజం సెప్పు?'

**అన్నీ ఉంటే**

అమ్మాయి: అమ్మా! ఏ లోటూ లేకుండా అన్నీ వున్న వాడికి నువ్వేను ఇస్తావు?

తల్లి: ప్రోత్సాహం

'మీ నాయనరా! మీ నాయన!'

'వూళ్ళోవాళ్ళంతా ఆడు సెలఁవయ్య గాడాఁవటంటున్నారే!'

'ఎవుళ్ళుతోనో ఏంది? నేజ్జెబుతుంటివిగా మీ నాయనని'

'నేన్నమ్మను!'

'ఛీ! నోర్ముయిరా!' ఏందా కూతలు!

'ఆడెవడో నిజం సెప్పు!'

'ఏఁవిటరా నే న్నీకు నిజంసెప్పేది? సెబుతుంటే తెలియటంలా?'

ఆశలన్ని పోగెయి పెరిగినకొడుకు కన్నతల్లిని అనుమానిస్తే అంతకంటే ఘోరం మరేం వుంటుంది? పేరమ్మతల్ల డిల్లి పోయింది.

'నిజంసెప్పు! ఎవుడమ్మాడు?'

'అయ్యో దేఁవుడా? నీకెట్టాసెప్పేదిరా? మీ నాయనరా! సత్తె పెమాణంగా మీ నాయనరా! ఎందుకురా నన్ను పీడిత్తా!'

'ఆణ్ణెవణ్ణో దీసుకొచ్చి యింటో బెట్టా వాఁవటాని అంటన్నారందరూ! తలెత్తుకోలేక సచ్చానంటే నమ్ము! అసలేందీ గోలంతా! నాకేం నచ్చలా యిది! నీ మంచి పేరంతా మంట గలిపేసుకున్నావ్! పేరమ్మంటే ఏంది నుప్పులాంటి మనిషన్నారంతా! ఇప్పుడేందిటా! నాకేంది నీ యిట్టం!'

బసవయ్య చరచరా చుట్టింటిలోంచి వెలుపలికి వచ్చాడు. పంచపాళీలో రెండో మంచంమీద పడుకొన్నాడు. అంతలోనే గురకపెట్టాడు. చుట్టింటిలోంచి పేరమ్మ ఏడ్పు సన్నగా వినబడుతూవుంది.

చలమయ్య వళ్ళు చల్లబడింది. తన మూలంగా తల్లీ కొడుకుల మధ్య

తగాదా రావటం సహించలేకపోయాడు. ఎవరో ఏమో అన్నారని అది విని తల్లిని అలా బాధపెట్టే కొడుకును ఏమ నాలో తెలియలేదు.

కంటికి రెప్పలాగా కొడుకును కాపాడుకొంది. ఆ కొడుకు ఇంత కఠి నంగా అనరాని మాటలంటుంటే ఏ తల్లి సహింపగలదూ? తన మూలంగా ఈ వయస్సులో ఆమె కెందుకు కష్టం కలగాలి?

ఇంతకాలం లేని తనువచ్చి, ఎంతో కాలం నుంచి ఉన్న కొడుకుకు ఆమెను దూరంచేయటం ఏమంత న్యాయం?

వాళ్ళ ఆప్యాయతను తెంచివేసే అధికారం తనకులేదు. వాళ్ళ సమష్టి అనురాగంలో తనకింత ధర్మం చేయగలి గితే చాలు! అయితే అది వీలులేదు. తనకిక్కడ స్థానంలేదు. వెళ్ళిపోవాలి. వెంటనే వెళ్ళిపోవాలి!

ఎక్కడికి? ఏంచేయాలి వెళ్ళి? ఏం దిక్కుంది తనకు?

ఎక్కడికయినా సరే, వెళ్ళాలి! వీళ్ళకు కష్టం కలిగించకూడదు. ముఖ్యంగా పేరమ్మకు, ఆశలుడిగిన జీవితంలో ఆశలు పుట్టించటం తప్పు! చనిపోయిందాకా తన్నెక్కడో బ్రతికి వుండటంకంటే ఏమీ చేయలేడు. తొలి కోడి కూసింది. ఆలోచిస్తున్నాడు. మలి కోడి కూసింది.

చలమయ్య మంచం మీంచిలేచాడు. వెళ్ళాలి! వెళిపోవాలి! అనుకొన్నాడు. ఎవరికీ కనిపించకుండా వెళిపోవాలి. ఇంట్లోకిపోయాడు. సీతమ్మ చాపమీద అమాయికంగా నిద్రపోతూవుంది. పైజామా లాల్చీ వేసుకొన్నాడు. జేబు బరువుగావుంది. పంచె దణ్ణెంమీదపడేశా డు. కిరసనాయిలు దీపంపక్కకుపెట్టాడు.

చుట్టింటిలో కుక్కిమంచంలో నిద్ర పోతూవుంది పేరమ్మ. కోడిగుడ్డుదీపం ఒత్తి పెకెత్తి ఆమె ముఖంలోకి చూశాడు. కళ్ళనీళ్ళుతిరిగాయి. వెను దిరిగి రాబోయి ఆగిపోయాడు. జేబులో ఉన్న పర్సుతీసి, పేరమ్మ పైట కొంగుకు కట్టి, దీపంకొండి తగ్గించి వెలుపలికి వచ్చాడు. రాత్రంతా ఏడ్చి ఎప్పుడో తెల్లవారుజామున నిద్రపోయిన పేరమ్మ గదరించిన ముఖం చలమయ్య కళ్ళలోనిలిచిపోయింది. వీధిలోకి వచ్చిం తర్వాత ఎటుపోవాలో తెలియక తిక మక పడ్డాడు.

ఎవరో తట్టినట్టు పేరమ్మకు మెలకువ వచ్చింది. పైటచెంగు బరువుగా తగి లింది. విప్పిచూస్తే పర్సు! కళ్ళనులుం కొని చూసింది. దీపందగ్గరగా చూచింది. పర్సునిండా డబ్బు!

పర్సు అక్కడే వదిలేసింది. లేచి వచ్చి మంచం చూచింది. గుండె ఆగి నంతపనయింది. ఇంట్లోకి పోయింది. పైజామా లాల్చీ లేవు. 'అనుకొన్నంత పనయ్యింది తండ్రో! అంటూ ఏడ్చింది. లాంతరు చేతబుచ్చుకొంది. పంచపాళీ లోకివచ్చి గురకపెడుతున్న కొడుకును లేపింది.

'నీ మూలంగానే ఎళిపోయేడు. పో! ఏడుండాడో ఎతికి దీసుకురా! పో! ఎటుబోయేడో ఏందో! లేరా! పో! బట్టేందుకుబో! ఆణ్ణుంచి వెళ్ళిపొమ్మని తిట్టబాక! పో! పోరా!' ★